క్లుప్తంగా

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార సమావేశం

బెల్లంపల్లి: విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవడానికి వినియోగదారులు ముందుకు రావాలని బెల్లంపల్లి విద్యుత్‌శాఖ ఏడీఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. కరెంట్ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం బెల్లంపల్లిరూరల్ సెక్షన్ కార్యాలయం వేదికగా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10–30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగే సమావేశంలో బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు హాజరై ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు టెక్నాలజీ నేర్పించాలి

లక్సెట్టిపేట: ఉపాధ్యాయులు విద్యార్థులకు టెక్నాలజీని నేర్పించాలని మండల విద్యాధికారి శైలజ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో సోమవారం లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల ఉపాధ్యాయులకు 'ఏ బుక్ ఆన్ డిజిటల్ లిటరసీ' శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, ఎస్‌ఆర్పీలు రాజన్న, అంజన్న, ఆర్పీలు శ్రీనివాస్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏకో బజార్

మంచిర్యాలఅర్బన్: భారత పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్, పర్యావరణ విద్యావిభాగం ఆధ్వర్యంలో ఈ నెల 16న మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఏకో బజార్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, కో–ఆర్డినేటర్ జాడి మహేశ్ తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలల విద్యార్థులు పర్యావరణ అనుకూల ఉత్పత్తులు, స్వదేశీ వస్తువులను ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన నాగుల శశివర్ధన్

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 8న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో లక్సెట్టిపేటలో జరిగిన తైక్వాండో జోనల్‌స్థాయి అండర్ 14విభాగంలో రెవెలేషన్ పాఠశాల విద్యార్థి నాగుల శశివర్ధన్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థి పాల్గొని రజతం పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా రెవెలేషన్ పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థి నాగుల శశివర్ధన్‌ను, విద్యార్థి మాస్టర్ అరుణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశాంత్, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కోటపల్లి: గ్రామపంచాయతీల అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీవో అక్తర్ కార్యదర్శులకు సూచించారు. పంచాయితీ డెవలప్‌మెంట్ యాప్ తనిఖీల్లో భాగంగా సోమవారం కొండంపేట గ్రామపంచాయతీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి అనిల్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి కలెక్టర్ సన్మానం

నస్పూర్: నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సపురా ఫాతిమాను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ అదనపు కలెక్టర్ చంద్రయ్య, సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి, ఆర్‌ఎల్‌సీ రాజేందర్‌తో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరికి చెందిన సపురా ఫాతిమా మంచిర్యాలలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల స్కూల్/కాలేజీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అభ్యసించి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎండి.తాహెరుద్దీన్, అబ్దుల్ నజీర్, విద్యా సమన్వయకర్త ఎండి.రిజ్వాన్, ప్రిన్సిపాల్ ఎం.సంధ్య, విద్యార్థిని తండ్రి ఎండి.అసద్‌ఖాన్ పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యం ఉత్తమం

మంచిర్యాలటౌన్: దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హోమియోపతి వైద్యం మెరుగైందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ ఆయుష్ పథకం కింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత, వైద్య శిబిరం ఇంచార్జి డాక్టర్ స్పందన, హోమియోపతి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటికి కరెంటు తీగలు అడ్డు..!

దండేపల్లి: ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరైందని సంతోషించిన ఓ లబ్ధిదారుకు కరెంటు తీగలు సమస్యగా మారాయి. సమస్య తీరాలంటే ఆర్థిక భారంగా మారింది. మండలంలోని మేదరిపేటకు చెందిన అత్తె సుమలతకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. నిర్మాణం పిల్లర్ల దశకు చేరింది. పై నుంచి త్రీఫేజ్ విద్యుత్ తీగలు ఉండడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో తీగలు తొలగించాలని దండేపల్లి విద్యుత్ ఏఈకి గత జూన్‌లో లబ్ధిదారు భర్త అశోక్ దరఖాస్తు చేశాడు. తీగలు తొలగించాలంటే రూ.26వేలు ఖర్చవుతుందని, అధికారులు ఆగస్టులో అంచనా కాపీ ఇచ్చారు. డబ్బులు చెల్లించే స్తోమత లేక బాధితులు రెండు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కరెంటు తీగలు తొలగించి పనులు సాగేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై దండేపల్లి విద్యుత్ ఏఈఈ బాపును సంప్రదించగా, తీగలు తొలగించాలంటే నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించాల్సిందేనని తెలిపారు.

ప్రమాదకరంగా స్తంభం



చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల నుంచి దుబ్బపల్లి, తుర్కపల్లి గ్రామాలకు వెళ్లే దారి పక్కనే విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రాజెక్టులోనే క్రీడాప్రాంగణం

నెన్నెల: గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, విద్యార్థులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఒక్కో మైదానానికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఖర్చు చేశారు. లక్ష్యం పూర్తి చేయాలనే ఉద్దేశంతో అధికారులు చెరువులు, అటవీ భూముల్లో ఎక్కడపడితే అక్కడ క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసి చేతులు దులుపేసుకున్నారు. ఇందుకు నిదర్శనం జోగాపూర్ మత్తడివాగు ప్రాజెక్టులో నిర్మించిన క్రీడా ప్రాంగణమే. మైదానంలోకి నీరు చేరడంతో ప్రస్తుతం క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిధులు నీళ్లలో పోసినట్లయిందని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



ఫ్లడ్ కాలనీలో మాతా సూపర్ మార్కెట్ పక్కన రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



నర్సయ్య భవన్ ఎదుట గాయత్రి నగర్ బోర్డు వద్ద..

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ వాసులు

నస్పూర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్‌లో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి కన్పిస్తోంది. ప్రధాన రహదారుల వెంటే రోజుల తరబడి పేరుకుపోతుంటే, ఇక అంతర్గత రోడ్లపై పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చెత్తను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పలు కాలనీల్లో వారం, పది రోజులకు ఒకసారి కూడా చెత్త తరలించే వాహనాలు ఇళ్లకు రాకపోవడంతో ప్రజలు తమ ఇళ్లలో పేరుకుపోయిన చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. దీంతో దారివెంట వచ్చే వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు.

తగ్గిన పారిశుద్ధ్య కార్మికులు..
చెత్త తరలించే వాహనాలు..

నస్పూర్ పరిధిలో గతంలో సుమారు 170మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించే వారు. కొన్ని నెలల క్రితం సుమారు 90మంది పారిశుద్ధ్య కార్మికుల ఒప్పంద కాలం ముగిసిందని, వారిని అధికారులు విధుల నుంచి తొలగించారు. దీంతో ప్రస్తుతం 72మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. చెత్త తరలించేందుకు గతంలో 42ట్రాలీలు, రెండు ట్రాక్టర్లు వినియోగించే వారు.. ప్రస్తుతం కేవలం 26ట్రాలీలను, ఒక ట్రాక్టర్‌ను మాత్రమే వినియోగిస్తున్నారు. మిగితా వాటిని జిల్లా కేంద్రంలో వినియోగిస్తున్నారు. ఒక వైపు పారిశుద్ధ్య కార్మికుల తగ్గింపు, వాహనాలను మరోచోట వినియోగిస్తుండడంతో కాలనీల్లోని ఇళ్లలో చెత్తను తీసుకెళ్లేందుకు సిబ్బంది వారం, పదిరోజులకు ఒకసారి కూడా రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

వారంలో రెండు రోజులైనా రావాలి

మేము సీసీసీలోని ఎస్‌ఎల్‌ఆర్ కాలనీలో నివాసం ఉంటాం. ఇళ్లలో సేకరించిన చెత్తను తీసుకెళ్లడానికి సిబ్బంది మా కాలనీకి పది రోజులకు ఒకసారి వస్తున్నారు. దీంతో సేకరించిన చెత్త ఇళ్లలోని చెత్త డబ్బాల్లో పేరుకుపోతుంది. సిబ్బంది మా కాలనీకి వారంలో రెండుమార్లయినా వచ్చి చెత్తను తీసుకెళ్లాలి.
– కిశోర్, ఎస్‌ఎల్‌ఆర్ కాలనీ, నస్పూర్

కంపు కొడుతున్న కాలనీలు

- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



తుర్కపల్లి వెళ్లే దారిలో నిలిచిన మురుగు నీరు

చెన్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మురుగు కాలువల్లో పూడికలు తీయించకపోవడం, తీయించిన చోట మళ్లీ పూడికలు నిండిపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైనే పారుతూ కంపు కొడుతున్నాయి. మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలుండగా, ఇందులో బావురావుపేట, పొక్కూరు, దుగ్నెపల్లి, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట, సుందరసాల, సుద్దాల, ఆస్నాద, కత్తెరసాల, గంగారం, కత్తెరసాల, కమ్మరిపల్లి గ్రామాల్లో మురుగు కాలువలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురికి నీరంతా ఇళ్ల ముందు, రోడ్లపై నిలిచి ఉంటుంది. దీంతో మురికి నీరు నిలిచిన చోట పెద్ద గుంతలు తయారై దోమలు వృద్ధి చెందుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు పట్టించుకొని గ్రామాల్లో కొత్తగా మురికి కాలువల నిర్మాణాలు చేపట్టి, పూడికలు తీయించి రోడ్లపై, ఇళ్ల ముందు మురికి నీరు నిలవకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం...

మండలంలో ఏయే గ్రామాల్లో మురికి నీరు రోడ్లపై పారుతుందో ఆ గ్రామాల్లో సంబంధిత కార్యదర్శులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తాం. గతంలో కూడా మురికి కాలువల్లో పూడికలు తీయించాం. అలాగే మురికి కాలువలు లేనిచోట పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే మురికి కాలువలు నిర్మిస్తాం. – అజ్మత్ అలీ, ఎంపీవో, చెన్నూర్

■ బొగ్గుబాయి వార్తలు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు కోరారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు చరిత్రలో నిలిచిపోయే హక్కులు సాధించి పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్నారు. ఈ సందర్భంగా గని మేనేజర్‌ను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం యూనియన్ సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, లాల, బ్రాంచీ నాయకులు వెంగళ కుమారస్వామి, అన్వేశ్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు. అనంతరం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చెట్లపొదలు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ నుంచి దుబ్బగూడెం వెళ్లే దారిలో ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చెట్ల పొదలు రోడ్డును కమ్మేస్తున్నాయి. దీనిపై ఈనెల 11న 'కమ్మేస్తున్న చెట్ల పొదలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, అధికారులు స్పందించారు. సోమవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను పంచాయతీ కార్యదర్శి కల్యాణ్ మాలిక్ తమ సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

చెత్తను తొలగించిన మున్సిపల్ సిబ్బంది



చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని పెద్ద చెరువు బట్టిగూడెం కాలనీ సమీపంలో గల నిమజ్జన ఘాట్ వద్ద చెత్త చెదారంతో పేరుకుపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, 'చెత్తను తొలగించరూ' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సిబ్బంది చెత్తను తొలగించి శుభ్రం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అధికారులతో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: సంస్థలో పనిచేసే ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో పారదర్శకంగా పనిచేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఏరియా ఉన్నతాధికారులతో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కంపెనీలోని సమాచార అధికారులు పౌరులు కోరిన తగిన సమాచారం అందించక చట్టాన్ని ఉల్లంఘిస్తే శాఖ పరమైన చర్యలను తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్సా, ఏజెంట్ శ్రీధర్, డీజీఎంలు అనిల్ కుమార్, ఆనంద్ కుమార్, మల్లయ్య, సర్వే అధికారి నర్సింగరావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా కృష్ణకాలనీలో రూ. 6.5లక్షలతో ఎంపీ నిధుల నుంచి చేపట్టిన సీసీ రోడ్డును సోమవారం సింగరేణి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏరియా కార్యదర్శి బరుపటి మారుతి ప్రారంభించారు.

కొత్త పెన్షన్ స్కీంలపై అవగాహన

మందమర్రిరూరల్: ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం కొత్త పెన్షన్ స్కీం, సీఎంపీఎఫ్, ప్రావిడెంట్ ఫండ్ తదితర అంశాలపై సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ –1 హరిపచౌరి అవగాహన కల్పించారు.

గుండా మల్లేశ్ ఆశయాలను కొనసాగిస్తాం



బెల్లంపల్లి: జోహార్లు అర్పిస్తున్న కామ్రేడ్స్

రామకృష్ణాపూర్/పాతమంచిర్యాల/కాసిపేట/బెల్లంపల్లి: దివంగత కామ్రేడ్ గుండా మల్లేశ్ ఆశయాల సాధనకు పాటుపడతామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. మల్లేశ్ ఐదో వర్ధంతిని సోమవారం నిర్వహించారు. సీపీఐ కార్యాలయాల్లో మల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి కామ్రేడ్స్ విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యాలయంలో, బెల్లంపల్లి బజారు ఏరియాలో విగ్రహం వద్ద, రామకృష్ణాపూర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో, కాసిపేట మండల కేంద్రంలో మల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. సామాన్య కార్మిక కుటుంబంలో జన్మించిన మల్లేశ్ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి ఆకర్షితుడై పార్టీలో చేరాడన్నారు. నిబద్ధత కలిగిన కామ్రేడ్‌గా పేదలు, కార్మికుల సమస్యలపై ఎన్నో పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. ప్రజల ఆదరాభిమానాలతో ఆసిఫాబాద్, బెల్లంపల్లి సీపీఐ ఎమ్మెల్యేగా నాలుగు సార్లు విజయం సాధించారని పేర్కొన్నారు. మల్లేశ్ భౌతికంగా లేకపోయిన ఆయన అనుసరించిన మార్గాన్ని తుది వరకు కొనసాగిస్తామన్నారు. మల్లేశ్ ఆశయాలను నెరవేర్చడానికి పాటుపడతామన్నారు. మల్లేశ్ మరణం సీపీఐకి తీరని లోటని తెలిపారు. నీతి నిజాయతీగా పనిచేసిన మల్లేశ్ నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయుడని కొనియాడారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్.నర్సయ్య, బెల్లంపల్లి పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బి.లక్ష్మీనారాయణ, రామకృష్ణాపూర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, కాసిపేటలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, మండల కార్యదర్శి జాడి పోశం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బాకీ కార్డుల పంపిణీ



లక్సెట్టిపేట: కార్డులు పంపిణీ చేస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/భీమారం/లక్సెట్టిపేట: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు హాజీపూర్, భీమారం, లక్సెట్టిపేట మండలాలు, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని వివరించారు. ఆ పార్టీ గ్యారంటీలు అబద్ధమని బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిలిచి కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో భీమారంలో మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, లక్సెట్టిపేటలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు తప్పవు



నిందితుడితో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ

కోటపల్లి: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి హెచ్చరించారు. మండలంలోని ఎసన్‌వాయి, సర్వాయిపేట గ్రామాల్లో సోమవారం గుడుంబా తయారీదారుల ఇళ్లలో సోదాలు నిర్వహించి 15లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసులు నమోదు చేశారు. సర్వాయిపేట చెరువుప్రాంతంలో 600లీటర్ల బెల్లంపాకం గుర్తించగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ ముడిపదార్థాలైన పటిక, నల్లబెల్లం విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకోవాలి

మంచిర్యాలఅర్బన్: తల్లిదండ్రులు, అధ్యాపకులు విద్యార్థులపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని ఆశలు వమ్ము చేయకుండా మంచి అలవాట్లను అలవర్చుకోవాలని డీఐఈవో అంజయ్య సూచించారు. సోమవారం మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధంగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపాళ్లు లక్ష్మణ్‌రావు, శంకర్, శ్రీనివాసరావు, అంజయ్య, శోభ, వసతిగృహం సంక్షేమాధికారులు కుమారస్వామి, మోసిన్, చందనలు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

చెన్నూర్: పంట పోయిందని ప్రాణాలు తీసుకున్న రైతు గడల మొండి కుటుంబానికి ప్రభుత్వం రూ.60లక్షల పరిహారం ఇవ్వాలని సీపీఎం చెన్నూర్ మండల కార్యదర్శి బొడెంకి చందు అన్నారు. బాధిత కుటుంబాన్ని సోమవారం సీపీఎం నాయకులు పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుడి కుటుంబానికి పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజేశ్వరి, చంద్రన్న, ఉమారాణి, శ్యామల, సమ్మక్కలు పాల్గొన్నారు.

'ఉనికి కాపాడుకోవడానికి తపన'

కాసిపేట: స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ఉనికి కాపాడుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు ఊర్లలో తిరుగుతున్నారని, ప్రజల మీద ప్రేమతో కాదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ విమర్శించారు. మండలంలోని కొండపూర్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సమీపించడంతో బాకీ కార్డుల పేరుతో కాంగ్రెస్‌ను విమర్శిస్తూ కార్యక్రమాలు చేస్తున్నారని, పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వకుండానే గడిపిందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రౌతు సత్తయ్య, నాయకులు గోలేటి స్వామి, దుర్గం ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

వేమనపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ పార్టీ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని మాజీ జెడ్పీటీసీ తలండి భీమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని నాగారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన తెలిపారు.